క్లుప్తంగా

బాధితులకు పోలీసుల అండ : ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో పని చేస్తుంది, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12మంది బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సదరు పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి పోలీస్ పరిధిలో ఉన్న ప్రతి అంశాన్ని పరిష్కరించి.. బాధితులకు న్యాయం చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులు సివిల్ వ్యవహారాల సమస్యలు ఉంటే కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఏఎస్పీ రాములు, సీసీఎస్ డీఎస్పీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

అవగాహన

జడ్చర్లటౌన్: అవోపా ఆధ్వర్యంలో సోమవారం షీ టీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీ టీం ఎలా పనిచేస్తుంది, వారి సేవలను ఎలా ఉపయోగించుకోవాలి తదితర అంశాలపై విద్యార్థినులకు, మహిళలకు వివరించారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు మురళీ కృష్ణ, నాయకులు శివకుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడికి నివాళి

జడ్చర్ల టౌన్: స్థానిక రంగస్థల నటుడు వెంకటరత్నం నాయుడు సేవలు చిరస్మరణీయమని తెలంగాణ సంగీత అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నవజ్యోతి కళానిలయం సభ్యులు సుదర్శన్, దత్తు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా క్లబ్ నూతన కార్యదర్శి మల్లు నర్సింహ రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మళ్లీ తనను కార్యదర్శిగా గెలిపించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా క్లబ్ కోశాధికారి యాదేశ్వరరెడ్డి, సభ్యులు రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సమితి గౌరవ సలహాదారు మద్ది అనంతరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి వేపూరు రాజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ధనుంజయ రెడ్డి, కార్యదర్శి జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ లైట్లు ప్రారంభం

నవాబుపేట: మండల కేంద్రంలో సోమవారం రాత్రి హైమాస్ లైట్లను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిధుల ద్వారా దాదాపు రూ. 10 లక్షలు వెచ్చించి మండల కేంద్రంలో లైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గోపాల్‌గౌడ్ వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, శ్రీనివాస్, నర్సింహులు, శ్రీశైలం, వెంకటయ్య, చిగుళ్లపల్లి నర్సింహులు, అశోక్ ఉన్నారు.

కేసు నమోదు

అడ్డాకుల: జానంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు మూసాపేట హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపారు. వేముల గ్రామానికి చెందిన జంగం మధు ఆదివారం మహబూబ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జానంపేట వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిందన్నారు. బాధితుడిని స్థానికులు జానంపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారని అక్కడి నుంచి మహబూబ్‌నగర్ తరలించారని వివరించారు. బాధితుడి సోదరుడు జంగం కేశవులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

మిడ్జిల్: చిల్వేర్ పంచాయతి పరిధిలోని రెడ్డిగూడలో సోమవారం రాత్రి మండల వ్యవసాయ అధికారి సిద్దార్థ ఫిర్యాదు మేరకు తనిఖీ చేయగా నక్షత్రమ్మ, శౌరీలు, ప్రకాష్ రెడ్డి ఇళ్లలో 6.5 కిలోల లూజు నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వారిపై కేసునమోదు చేశామని వివరించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



ఎనుగొండలోని రైల్వే గేటు సమీపంలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎనుగొండ- బీసీకాలనీలో మహిళా ద్వాక్రా భవనం, రైల్వేగేటు సమీపంలో సీసీరోడ్డును సోమవారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా అంజనేయ స్వామి ఆలయ మండపానికి భూమిపూజ నిర్వహించారు. లక్ష్మీనాయక్‌తండాలో మరమ్మతు చేసిన బోరును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలకు రక్షణగా షీ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనగానే కల్లబొల్లి కబుర్లు చెబుతూ ప్రజల్లోకి వచ్చే ప్రతిపక్షాల తీరును జాగ్రత్తగా గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కల్యాణలక్ష్మి వంటి మహిళలకు అండగా నిలిచే పథకం ఏదైనా అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతుబంధు, రైతుబీమాతో పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. బతుకుదెరువు నిచ్చే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలిచామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, స్థానిక నాయకులు పెద్దగొల్ల నర్సిములు యాదవ్, పురుషోత్తం, శాంతిభూషణ్‌గౌడ్, పర్వతాలుయాదవ్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం నమ్మవద్దు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కులం, మతం పేరిట యువతలో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు వాట్సాప్ ద్వారాచేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అలాంటి వారి మాయలో పడవద్దని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎనుగొండలోని బీసీ కాలనీ, లక్ష్మీనాయక్ తాండాలకు చెందిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. అంతకుముందుపార్టీ జెండాను ఆవిష్కరించారు. కుల మతాల కన్నా అభివృద్ధి ముఖ్యమన్నారు. గతంలో గిరిజనులను ఓటు బ్యాంక్‌గానే చేశారని తమ హయాంలో వారి సంక్షేమానికి పెద్ద పీట వేశామని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి వేలాది మంది గిరిజనులకు సర్పంచులుగా అవకాశం దక్కేలా చేశామన్నారు. హైదరాబాద్‌లో గిరిజన భవన్ పెద్ద స్టార్ హోటల్‌ను తలపించేలా నిర్మించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సిములు, ముడా చైర్మన్ వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, కౌన్సిలర్ కిషోర్, నర్సిములు, శ్రీను, పురుషోత్తం, నరేష్ పాల్గొన్నారు.

రెడ్డిపల్లి స్టేజీవద్ద రైతుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు

గండేడ్: తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళనకు దిగిన ఘటన సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కొనుగోలుకేంద్రంలో చోటుచేసుకుంది. ఈ క్రమంలో నిర్వాహకుల తీరును రైతులు ఎండగట్టారు. టోకెన్‌ల వారీగా కాకుండా తమకు అనుకూలంగా ఉన్న వారి ధ్యాన్యాన్ని లారీల్లో లోడ్ చేస్తున్నారన్నారు. వారం రోజుల నుంచి ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్ల బస్తాలు తీసుకువచ్చి ప్రధానరహదారిపై వేసి రాస్తారోకో నిర్వహించారు. ధాన్యాన్ని రోడ్డుపై వేసి దగ్ధం చేయడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ రాఘవేందర్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ముందుగా తూకం వేసిన ధ్యాన్యాన్ని పంపిస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై నిర్వాహకులు... రైతులు సొంతంగా కిరాయి పెట్టుకుని లారీలు తీసుకువచ్చి రైస్‌మిల్లులకు తరలించుతున్నారని చెప్పారు. దీంట్లో తమ జోక్యం ఏమీ లేదని ముందుగా కొనుగోలు చేసిన బస్తాలు ఖాళీ కాకపోవడంతో లారీలు పంపలేదన్నారు. దీంతో చేసేది లేక రైతులు స్వయంగా వెళ్లి లారీలను మాట్లాడుకుని తమ ధ్యాన్యాన్ని తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పుకొచ్చారు.

పంచాయతీ కార్యదర్శుల సంబరాలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు మిఠాయి తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 28వ తేది నుంచి మే14 వరకు వరకు కార్యదర్శులు సమ్మె నిర్వహించిన విషయం తెలిసిందే. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఫాం హౌస్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ నాయకులు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న జడ్చర్లలో కాంగ్రెస్ బహిరంగ సభ



బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు మల్లురవి, అనిరుధ్‌రెడ్డి, ఎర్రశేఖర్

జడ్చర్ల: సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా జడ్చర్లలో ఈనెల 25న భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి తెలిపారు. ఆయన టీపీసీసీ సెక్రటరీ అనిరుధ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌లతో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలు తమకు తెలిపారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తామని, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు రూ.5లక్షలు ఇస్తామని, రూ.2లక్షలు రుణ మాఫీ ఏకమొత్తంలో చేస్తామని, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందిస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. జూరాల నుంచి వరద జలాలను సునాయాసంగా తరలించే పరిస్థితి ఉండగా కేసీఆర్ సొంత ఆలోచనతో డిజైన్ మార్చారన్నారు. పంపులు, మోటార్లు, పైపుల కొనుగోలులో భారీ కుంభకోణం ఉందన్నారు. ఈనెల 25న బహిరంగ సభకు హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు రానున్నట్లు వివరించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో సోమవారం ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్స వాలను నిర్వహించారు. తెలుగు వీధిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠను చేశారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయం లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సా యంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ఊరేంగిపు చేపట్టారు. విద్యాసాగర్, జగన్, మనోజ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

323 మందికి కంటి పరీక్షలు

భూత్పూర్: మండలంలోని శేరిపల్లి (హెచ్)లో సోమవారం 323 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 66 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 33 మందికి కంటి అద్దాలు రావాల్సి ఉండగా 49 మందిని ఆపరేషన్ కోసం రేఫర్ చేసినట్లు సీహెచ్‌వో రామయ్య తెలిపారు. సర్పంచ్ బోల శేఖర్, వైద్యాధికారి డా.రాధిక, సీహెచ్‌వో రామయ్య పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలంటూ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకద్ర రూరల్: పట్టణంలో కొత్తగా నిర్మించిన ఆర్వోబీకి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలోని రహదారిపై రాస్తారోకో చేపట్టారు. నిర్మాణం పూర్తిస్థాయిలో కాకుండానే ప్రారంభించారని, దీని వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్వోబీకి సర్వీస్ రోడ్డు లేకపోవడంతో పాటు రైల్వే గేట్ మూయడంతో బస్సులు బస్టాండ్‌కు రాకుండా ప్రయాణికులను ఆర్వోబీ చివరలోనే దించి నేరుగా వెళ్తున్నాయని దీంతో వారు అవస్థలు పడుతున్నారని , అసంపూర్తి పనుల వల్ల ఆర్వోబీ ఎక్కి, దిగే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయడంతో పాటు ఆర్వోబీ లోపాలను సవరిస్తూ సర్వీస్‌రోడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. రాస్తారోకో సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ వెంకటేష్ అక్కడికి చేరుకొని సిబ్బంది సహాయంతో రాస్తారోకో చేస్తున్న వారిని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను సరి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండ అంజన్‌కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో రైతులకు మేలు

బాలానగర్: రైతులకు రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని సోమవారం తెలంగాణ గిరిజన కోపరేటివ్ చైర్మన్ వాల్యానాయక్ ఎంపీపీ కమలతో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, మిషన్‌కాకతీయ వంటి అనేక రైతు అనుకూల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో రైతులుకు మేలు కలుగుతోందని వివరించారు. రైతుబంధు మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి, ప్రభులింగం, బాలునాయక్, జంగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



బాలానగర్ : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని సోమవారం రాష్ట్ర టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ ఏడీఏ డీ.సుధారాణి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల నిల్వలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మకాలకు సంబంధించిన ప్రతి దానికి రశీదు ఉండాలని, కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు అందజేయాలని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఎక్కడైనా అనుమతులు లేని నకిలీ పత్తి విత్తనాలను అమ్మేందుకు చర్యలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవసరమైతే పీడీ చట్టం ప్రయోగిస్తామని అన్నారు. వారి వెంట ఏడీఏ ఆంజనేయులు, సర్టిఫికేషన్ అధికారి ప్రసన్న, ఎంఏఓ ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



పత్తి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



శాఖాపూర్ వద్ద రహదారి పక్కన చీలిపోయిన చెట్టు

జడ్చర్ల: అకాల వర్షంతో ఆరుబయట ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పట్టణంలో సోమవారం తెల్లవారు జామున ఆకస్మికంగా వర్షం కురిసింది. దీంతో బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు, జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డు, అదేవిధంగా రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి పోయింది. ధాన్యం కుప్పల చుట్టు నీరు చేరింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే బాదేపల్లి యార్డులో వ్యాపారులు కొనుగోలు చేసిన దాదాపు 2వేల బస్తాల ధాన్యం వర్షానికి తడసిపోయింది. కొంత ధాన్యం కొట్టుకు పోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సకాలంలో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఈసందర్భంగా పలువురు రైతులు వాపోయారు.

24 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

అడ్డాకుల: మండల కేంద్రంలో 24 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో కొన్ని చోట్ల చెట్లు నేలకూలాయి. కరెంటు తీగలు ఉన్న చోట చెట్ల కొమ్మలు తీగలపై పడటంతో సరఫరాను నిలిపి వేశారు. సోమవారం ఉదయం తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన తర్వాత సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారి పక్కన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు చాలా చోట్ల ఈదురు గాలులకు నేలకూలాయి. దాసర్‌పల్లి గ్రామంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో ఆదివారం సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం సాయంత్రం వరకు కూడా కరెంటు సరఫరాను పునరుద్ధరించలేదు. గ్రామంలో సుమారు 10కి పైనే విద్యుత్ స్తంభాలు నేల కూలాయని స్థానికులు పేర్కొన్నారు.

కళాశాలపై నుంచి విద్యుత్ తీగలు

- ఖర్చుకు భయపడి లైను మార్చడానికి ముందుకు రాని అధికారులు



కళాశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పైకప్పు మీదుగా వెళ్తూ హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తీగలను కళాశాల ఆవరణ నుంచి తొలగించి బయట ఏర్పాటు చేయాలని సిబ్బంది పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన రావడం లేదు. ఇదే లైనుకు సంబంధించిన తీగలు కళాశాల బయట కొన్ని ఇళ్లకు సైతం ఆనుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. ఏటా విద్యార్థులు, అధ్యాపకులు తీగలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టడం లేదు. కాగా విద్యుత్ లైను మార్చడానికి ఖర్చు ఎక్కువయ్యే అవకాశం ఉందన్న కారణంతో అధికారులు ముందుకు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై అవగాహన అవసరం



వడ్డెరబస్తీలో అవగాహన కల్పిస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేక వాహనంలో మహిళా సంఘం సభ్యులతో పాటు మున్సిపల్ సిబ్బంది స్థానిక టీచర్స్‌కాలనీ, వడ్డెరబస్తీ, శివశక్తినగర్, రామయ్యబౌలి తదితర ప్రాంతాల్లో తిరిగారు. ఎక్కడికక్కడ ఆయా సెంటర్ల లో పాత దుస్తులు, ఇతరత్రా ఏమైనా వస్తువులు ఉంటే దాతలు ఇవ్వాలని కోరారు. పేదలకు వాటిని తి రిగి ఇచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

పల్లెలను శుభ్రంగా ఉంచాలి

కోయిల్‌కొండ: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని వాటని పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. రాంపూర్‌లో ప్రత్యేకాధికారి మధుసుదన్‌గౌడ్‌తో కలిసి సోమవారం పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రం ఉంచుకోకపోవడం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయన్నారు. గ్రామాల అధికారులు, నాయకులు పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల సహకారంతో పల్లెలను శుభ్రం చేయాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో పంచమ వార్షికోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: అప్పన్నపల్లిలోని తిరుమలహిల్స్‌లో వెలసిన త్రినేత్ర దశభుజ వీరాంజనేయస్వామి దేవస్థాన పంచమ వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం సుప్రభాత సేవ, ఆరాధన, ధ్వజారోహణం, అష్టోతరశత కలశ, అలంకరణ, అగ్నిప్రతిష్ఠ, మూల మంత్రహోమం, శ్రీహనుమాన్ చాలీసా హోమం తదితర పూజలు చేపట్టారు. వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సీతారాముల కల్యాణ మహోత్సవం, ద్వాదశ ఆరాధన, ధ్వజా అవరోహణం ఉంటాయని శ్రీమత్ ఎం బెరుమనార్ పీఠం ప్రతినిధులు తెలిపారు.

గ్రూప్-4 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



హన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

హన్వాడ: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రూప్-4 పరీక్ష నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. జులై 1న నిర్వహించనున్న పరీక్షల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి రాజునాయక్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చనున్నట్లు వివరించారు. ఇందుకుగాను తగిన ఏర్పాట్లన్నీ పరీక్షా సమయానికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తం 220 మంది ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఇన్‌చార్జ్ జీహెచ్‌ఎం విజయభాస్కర్ ఉన్నారు.

కోయిల్‌కొండ: మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాలలో గ్రూప్-4 పరీక్ష నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు పేర్కొన్నారు. పాఠశాలలోని తరగతి గదులను, పరీక్షాలకు సంబంధించి వసతులను సోమవారం పరిశీలించారు. సెంటర్‌లో 240 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు. వారి వెంట హెచ్‌ఎం వెంకటాజీ, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

'రెగ్యులరైజ్ చేయాలి'



కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కోరారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్‌ఎస్) లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలన్నారు. రెగ్యులర్ టీచర్లకు వర్తించే అన్ని రకాల సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.కిష్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్, ఉపాధ్యక్షురాలు పి.ఉమాదేవి, కోశాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ ధర్నా శిబిరానికి సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు ఎన్.కురుమూర్తి, ప్రశాంతచారి వచ్చి మద్దతు తెలిపారు. అనంతరం సంఘం నాయకులు కొత్త కలెక్టరేట్‌కు వెళ్లి ఏఓ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి

మహబూబ్‌నగర్ రూరల్ : భాగ్యరెడ్డి వర్మ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. పాతపాలమూరులో జ్ఞాన నీలి బహుజన మహనీయుల శోభ యాత్ర జిల్లా కన్వీనర్ పాతూరి రమేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ భాగ్యరెడ్డివర్మ సేవలను కొనియాడారు. కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు కృష్ణయ్య, జి.చిన్నయ్య, వై.సుధాకర్, మహేష్, కె.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ పటిష్టతకు కృషి చేయండి



అడ్డాకుల: బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి గ్రామాల్లో కాంగ్రెస్ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ అన్నారు. సంకలమద్దిలో కాంగ్రెస్ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొక్కల రత్నయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఎండీ గౌస్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా తిరుపతి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. మాజీ ఎంపీటీసీ అంజనేయులు, సురేందర్, పాల్గొన్నారు.